




RNI : APBIL/2023/86665



# రాయల్ జర్నలిజం

ద్వి భాషా దినపత్రిక

ROYAL JOURNLISAM

గుంటూరు, సంపుటి : 02 సంచిక : 38 | ఆదివారం 2 - 3 - 2025 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | పేజీలు : 8 | వెల : రూ.2-00

GUNTUR VOL-02 ISSUE - 38 CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO 2 SUNDAY MARCH 2025 PAGES : 8 Rs :2-00


# గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసం నాకే అర్థం కావడం లేదు: సీఎం చంద్రబాబు

చిత్తూరు : ఏపీ సీఎం చంద్రబాబు చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజా వేదిక సభలో ఆయన ప్రసంగించారు. పేదల జీవితాల్లో వెలుగు రావాలనేదే తన ఆకాంక్ష అని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు, ఆ ఐదేళ్లలో జరిగిన విధ్వంసం నాకే అర్థం కావడం లేదు అని వ్యాఖ్యానించారు. అయితే, ప్రజలు వెంటనే తెలుసుకుని కూటమి ప్రభుత్వాన్ని తీసుకువచ్చారని చంద్రబాబు వెల్లడించారు. ప్రతి నెల ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందిస్తున్నామని, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునేందుకు నిత్యం కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం నుంచి అందే ప్రతి సేవ కూడా సెల్ ఫోన్ సాయంతో అందించేందుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. డ్రోన్ ద్వారా ఎరువులు, పురుగుమందులతో వ్యవసాయంలో ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటున్నామని... అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన ద్వారా పేదల జీవితాల్లో మార్పులు తీసుకువస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. సంపద ఎలా సృష్టించాలనే దానిపై నిత్యం ఆలోచిస్తున్నామని అన్నారు. “కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 మాసాల్లోనే 12.9 శాతం వృద్ధి రేటు నమోదు చేశాం. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో కలిసి చేసే పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చి పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తున్నాం” అని చంద్రబాబు వివరించారు. ఇక, నాగరిక ప్రపంచంలో పారిశుద్ధ్యం చాలా అవసరం అని అన్నారు. గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ పరిస్థితులు మెరుగుపరుస్తున్నామని... మరో రెండు నెలల్లో రహదారులపై గుంతలు పూడ్చడం పూర్తవుతుందని చెప్పారు.

అడవి పందుల్లా తిన్నంత తిని నాశనం చేశారు: సీఎం చంద్రబాబు

బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి బడ్జెట్ లో అధిక ప్రాధాన్యత ఇచ్చామని , రాష్ట్ర ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వ పాలన సాగుతోందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఏ ఒక్కరి ముఖాల్లో చిరునవ్వు లేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అందరూ సంతోషంగా ఉన్నారని అన్నారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరులో పింఛన్ల పంపిణీలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాల అమలుపై స్పష్టత ఇచ్చారు. సూపర్ సిక్స్ తో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతామని అన్నారు. “పేదల జీవితాల్లో వెలుగు రావాలి. వారు




ఆనందంగా ఉంటే చూడాలన్నదే నా కోరిక. గత ప్రభుత్వ పాలన చూశాం . రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. అడవి పందుల్లా తిన్నంత తిని నాశనం చేసి పోయారు. ఒక్కో అడుగు ముందుకు వేస్తున్నాం, అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తున్నాం. గత ప్రభుత్వం పెట్టిన రూ. 24 వేల కోట్ల బకాయిలు తీర్చాం. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం లక్ష్యంగా రూ. 3 లక్షల కోట్లతో బడ్జెట్ తెచ్చాం. ఈ ఏడాది జూన్ నాటికి డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి పోస్టింగులు ఇస్తాం. మే నెలలో తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎందరు పిల్లలు ఉంటే అందరికి రూ.15 వేలు జమ చేస్తాం. అన్నదాత సుఖీభవ కింద అర్హులైన ప్రతి రైతుకూ ఏటా రూ. 20 వేలు ఇస్తాం. మత్స్యకారులకు రూ. 20 వేలు ఆర్థిక సాయం అందిస్తాం. రూ. 5 కే అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నాం. ఇప్పటికే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశాం” అని వెల్లడించారు.

**పీ4తో పేదరిక నిర్మూలన**పేదరిక నిర్మూలన లక్ష్యంగా ఈనెల 30వ తేదీ ఉగాది నుంచి పీ4కు శ్రీకారం చుట్టబోతోన్నాం. పేదరిక నిర్మూలన విషయంలో ప్రజల అభిప్రాయాలు, ఆలోచనలను తీసుకుని ఞా%4 విధానాన్ని అమలు చేస్తాం. ఆర్థికంగా అగ్రస్థానంలో ఉన్న 10 శాతం మంది... అట్టడుగున ఉన్న 20 శాతం మందికి చేయూతను ఇవ్వడం ద్వారా పేదలకు ఆర్థికంగా బలోపేతం చేయవచ్చు. వైసీపీ తప్పుడు విధానాలతో రాష్ట్రాన్ని దోచుకుతింటే ఎన్డీఏ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రతి ఒక్క రూపాయి పేదలకు ఖర్చు చేస్తోంది. నేను చెత్త నుంచి సంపద తయారుచేస్తే గత పాలకులు చెత్త మీద పన్ను వేశారే కానీ ఇంటి ముందు చెత్త తీయలేదు. గత ఐదేళ్లలో ఒక్క గ్రామంలోనూ సిమెంటు రోడ్డు వేయలేదు. గోకులాలూ నేను కట్టించినవే. 9 నెలల్లో 20 వేల కిలోమీటర్ల రోడ్ల మరమ్మతులు చేసి గుంతలు పూడ్చాం.

**వాళ్లతో జాగ్రత్త** రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఇల్లు, మంచినీటి కుళాయి, మరుగుదొడ్లు, కరెంటు , దీపం కింద గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలన్నదే నా లక్ష్యం. కేంద్ర నిధులనూ ఇతర అవసరాలకు మళ్లించిన వారి విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలి. ప్రజలను నేను కోరేది ఒక్కటే. ఏ పార్టీ వల్ల లాభమో ప్రజలు ఆలోచించాలి. కులం, మతం, ప్రాంతాల వారీగా విభజించే వారితో రాష్ట్రానికి చేటు తప్పించి ఉపయోగం లేదు.

మొన్నటి ఎన్నికల్లో కరెక్ట్ గా చేసుంటే పులివెందుల కూడా మనదే అయ్యేది: సీఎం చంద్రబాబు

చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరులో నేడు పేదల సేవలో కార్యక్రమం అనంతరం సీఎం చంద్రబాబు నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యకర్తలను చూస్తే తనకు కొండంత ధైర్యం వస్తుందని అన్నారు. గత 8 నెలలుగా పరిపాలనలో నిమగ్నమయ్యానని, అందుకే పార్టీ శ్రేణులతో సమావేశం కాలేకపోయానని వివరణ ఇచ్చారు. మళ్లీ ఇన్నాళ్లకు కుటుంబ సమానులైన కార్యకర్తలను కలుసుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. “30 ఏళ్ల తర్వాత జీడీ నెల్లూరు కోటపై టీడీపీ జెండా ఎగురవేశాం. పార్టీ విజయం కోసం కార్యకర్తలు ప్రాణం పెట్టి పనిచేశారు. మీకు నేను పూర్తిగా సహకరిస్తా. ఈ నియోజకవర్గం పార్టీకి కంచుకోటగా మార్చాలి. తంబళ్లపల్లి, పుంగనూరులో కొంచెం గురి తప్పాం తప్ప జిల్లా అంతటా టీడీపీ జెండా ఎగిరింది. వై నాట్ 175, వై నాట్ కుప్పం అన్నవాళ్లు ఇప్పుడు ఏమయ్యారు.? మొన్నటి ఎన్నికల్లో సరిగా చేసుకుని ఉంటే పులివెందులలోనూ మనమే గెలిచేవాళ్లం. పార్టీ స్థాపించిన నాటి నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అనేక సమస్యలు ఎదుర్కొన్నాం. ఈసారి మనం పకడ్బందీగా వ్యవహరించడంతో ఉమ్మడి జిల్లాలో 12 స్థానాలు గెలిచాం. మిమ్మల్ని, నన్ను ఎన్ని ఇబ్బందుల పెట్టినా ప్రాణాలు పోయినా పర్వాలేదు గానీ, వారికి లొంగబోమని పోరాడటంతో 93 శాతం సీట్లు గెలిచాం” అని వివరించారు.

**ఆ రోజు టీడీపీని నేనే ఓడించుకున్నా**

2004, 2019లో పార్టీని నేనే ఓడించుకున్నా. రాష్ట్రాన్ని బాగు చేయాలని, ప్రజల తలరాతలు మార్చాలని మిమ్మల్ని (కార్యకర్తలను) పట్టించుకోకుండా పని చేశా. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రభాగాన నిలబెట్టా. 2004లో ఓడిపోయాక అధికారంలోకి రావడానికి 10 ఏళ్లు పట్టింది. మళ్లీ 2014లో చాలా సమస్యలు వచ్చాయి. రెండు రాష్ట్రాల్లో పార్టీని కాపాడుకోవడం చారిత్రాత్మక అవసరం. కానీ సమైక్య ముసుగులో వైసీపీ విభజన కోరుకుంది. అయినా ప్రజలు విజ్ఞతతో ఆలోచించి మనల్ని గెలిపించారు. 2014-2019 మధ్య అవిశ్రాంతంగా పనిచేసి 13.5 గ్రోత్‌రేట్ సాధించాం. ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిందంటే దానికి కారణం ప్రజలకు మంచి చేయకపోవడం వల్ల కాదు... కార్యకర్తల్లో అసంతృప్తి వల్లే. మీలో అనువణువు పసుపు రక్తం తప్ప మరొకటి ఉండదు. మీతో నేను మాట్లాడకుంటా ఉంటే మీరు కూడా నాపై అసంతృప్తిలో ఉంటారు. అందుకే కార్యకర్తల కోసం సమావేశం ఏర్పాటు చేశాను.

**నాకు, కార్యకర్తలకు మధ్య దూరం ఉండదు**

మునుపు ఎన్నికలయ్యాక కేడర్ కోసం ఆలోచించలేకపోయాం. కానీ ఈసారి కార్యకర్తలకు, నాకు గ్యాప్ ఉండదు. పర్యటనకు వెళ్లిన ప్రతిచోటా కార్యకర్తలు, నేతలతో సమావేశమవుతా. ప్రభుత్వంలో ఉన్న మనం ప్రజల కోసం ఏం చేస్తున్నామో చెప్పడానికి కూడా సోషల్ మీడియా ఒక ఆయుధం...ప్రజలకు సమాచారం త్వరగా చేరవేయడంలో కీలకంగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలి.

**వారికి మేలు చేస్తే పాముకు పాలు పోసినట్టే**

వైసీపీ నేతలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపకారం చేసే పరిస్థితి ఉండకూడదు. ఈ విషయం నేతలకు నేరుగా, గట్టిగా చెబుతున్నా. వైసీపీకి ఉపకారం చేస్తే పాముకు పాలు పోసినట్లే. శ్రేణులు కూడా ఎవరి ఇష్టం వచ్చినట్టు వారు కాకుండా నాయకత్వం కింద పనిచేయాలి. ఎమ్మెల్యేలు, ఎంపీలు వన్ టైంగా చూసుకోవద్దు. మీరు రాజకీయాల్లో ఉన్నన్నాళ్లు ప్రజాప్రతినిధులుగా ఉండాలి. కార్యకర్తలకు మీరు అండగా ఉండాలి, అందుబాటులో ఉండాలి.నాకు ఎన్ని పనులున్నా ఎక్కడికెళ్లినా కార్యకర్తలను కలవడం బాధ్యతగా పెట్టుకుంటా. మొన్నటి ఎన్నికల్లో నా మిత్రులను కూడా పక్కనబెట్టా. అవసరమైతే మీతో కలిసి టీ తాగుతా, భోజనం చేస్తానని చెప్పాగానీ పార్టీని త్యాగం చేయనని నా మిత్రులకు స్పష్టంగా చెప్పాను” అని చంద్రబాబు వివరించారు.

## మంత్రాలయం రాఘవేంద్రస్వామిని దర్శించుకున్న మంత్రి నారా లోకేశ్...



మంత్రాలయం: ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నేడు కర్నూలు జిల్లాలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం విచ్చేశారు. ఇక్కడి రాఘవేంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. అంతకుముందు, స్థానికంగా ఉన్న మాంచాలమ్మ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి గురువైభవోత్సవాల్లో పాల్గొనడంపై లోకేశ్ స్పందించారు. మంత్రాలయంలో గురువైభవోత్సవాల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. రాయలసీమలో వలసలు లేకుండా చూడాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. కాగా, మంత్రాలయం పర్యటన సందర్భంగా స్వామివారి పట్టాభిషేక మహోత్సవం అనంతరం ఆలయంలో జరిగిన రథోత్సవంలోనూ నారా లోకేశ్ పాల్గొన్నారు. స్వయంగా రథాన్ని లాగారు. ఆలయ ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ను ప్రారంభించారు.

## అలా మాట్లాడినందుకే ఒక వ్యక్తి జైల్లో లబోదిబోమంటున్నాడు: మంత్రి నాదెండ్ల

అమరావతి: జనసేన పార్టీ ఆవిర్భావ సభ మార్చి 14న పిఠాపురంలో జరగనున్న నేపథ్యంలో, పార్టీ ఆవిర్భావ సభ నిర్వహణ కమిటీలతో జనసేన పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ నేడు సమావేశమయ్యారు. కాకినాడలో జరిగిన ఈ సమావేశంలో నాదెండ్ల మాట్లాడుతూ, సభ నిర్వహణపై కమిటీలకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో విజయం సాధించాక జరుగుతున్న తొలి ఆవిర్భావ సభ కావడంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన, పవన్ ను దూషించిన వారి గురించి ప్రస్తావించారు. పవన్ వంటి నేతలను తిడితే హీరోలు కాదు జీరోలు



అవుతారని స్పష్టం చేశారు. “పవన్ కళ్యాణ్ గారిని వ్యక్తిగతంగా దూషించడం అందరికీ ఫ్యాషన్ అయిపోయింది. ఎమ్మెల్సీగా వ్యవహరిస్తున్న వ్యక్తి ఏ విధంగా మాట్లాడారో మనం చూశాం. నోరుందని ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు. ఇలా మాట్లాడినందుకే ఒక వ్యక్తి జైల్లో కూర్చొని లబోదిబోమంటున్నాడు. ప్రభుత్వం మారినా కొందరు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు... వారిని వదిలిపెట్టం, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. నిస్వార్థంగా ప్రజల కోసం పనిచేసే వారిపై బురద జల్లాలని చూస్తే దిగజారిపోతారు. పార్టీ, నాయకుడిని కించపరిచేలా ఎవరూ మాట్లాడినా జనసైనికులు, వీర మహిళలు కచ్చితంగా ఖండించాలి. అయితే దానికి సరైన పద్ధతి ఎన్నుకోవాలి” అని నాదెండ్ల వివరించారు.

## లక్ష కోట్ల అప్పుకు సిద్ధం, ఆశలన్నీ అక్కడే - ఏం జరుగుతోంది

అమరావతి: ఏపీ ప్రభుత్వం భారీ బడ్జెట్ ప్రవేశ పెట్టింది. 2025-26 ఆర్ధిక సంవత్సరా నికి రూ 3.22 లక్షల కోట్ల అంచనాలతో బడ్జెట్ ను ప్రతిపాదించింది. ఇందులోనే నిధుల సమీకరణ పైన ప్రభుత్వ అం చనాలు ఆసక్తి కరంగా మారు తున్నాయి. రుణాల ద్వారా లక్ష కోట్లకు పైగా సమీకరించాలని భావి స్తోంది. కేంద్ర గ్రాంట్లపై కొండంత ఆశ పెట్టుకుంది. ఆదాయ అంచ న




లు బడ్జెట్ లో చెప్పిన విధంగా ప్రభుత్వం అందుకోగలదా అనే సందేహాలు ఇప్పుడు మొదలయ్యాయి.

**మారుతున్న లెక్కలు** :ఏపీ ప్రభుత్వం బడ్జెట్ లో రుణాల గురించి కీలక అంచనాలను వెల్లడించింది. బడ్జెట్ ప్రతిపాదన ల మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం భారీ మొత్తంలో రుణాలను తీసుకో వాలని నిర్ణయించింది. రూ 3.22 లక్షల కోట్ల బడ్జెట్‌లో రుణాల ద్వారానే 1, 04,382 కోట్లు సేకరించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో రిజర్వ్ బ్యాంకు నిర్వహించే సెక్యూరిటీల వేలం ద్వారానే 80,456 కోట్ల రుణాలు తెచ్చుకోవాలని నిర్ణయించారు. అలాగే కేంద్రం నుంచి వివిధ పథకాల కింద మరో 21,700 కోట్ల రుణంగా వస్తుందని అంచనా వేశా రు. డిపాజిట్ ట్రాన్సాక్షన్ ద్వారా 700 కోట్లు, ఇతర రుణాల ద్వారా 1,500 కోట్లు, లోన్స్ అడ్వాన్సుల ద్వారా 26 కోట్ల రూ పాయల వరకు వస్తాయని ప్రతిపాది ంచారు.

**లక్ష కోట్లు అప్పు చేస్తాం** : 2024-25 లో గత ఏడాది బహిరంగ మార్కెట్ ద్వారా 71 వేల కోట్లు రుణ సమీ కరణ చేయాలని నిర్ణయించగా, ప్రస్తు తం ఆ సంఖ్య 80 వేల కోట్ల వరకు చేరిపో యింది. ఏపీ ప్రభుత్వం కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు, పన్నేతర ఆదాయంపై కొండంత ఆశలు పెట్టుకున్నట్లు స్పష్టం అవుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి రూ. 7,432 కోట్ల పన్నేతర ఆదాయం వచ్చింది.


2వ పేజీలో


## స్క్రిప్ట్ ఎవరిచ్చినా... అనుభవించేది 'రాజా'నే: వంగలపూడి అనిత

అమరావతి: వర్గ వైషమ్యాలను రెచ్చగొట్టేలా మాట్లాడడంతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను, ఆయన కుటుంబ సభ్యులను కించపరిచే విధంగా మాట్లాడిన సినీ నటుడు పోసాని కృష్ణమురళికి కోర్టు రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే. అయితే, వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ఇచ్చిన స్క్రిప్ట్ నే తాను మీడియా ముందు చెప్పేవాడినని పోలీసు విచారణలో పోసాని చెప్పారు. ఈ మేరకు నేరాన్ని అంగీకరిస్తూ నేరాంగీకర ణపత్రంపై సంతకం చేశారు. దీనిపై ఏపీ హోం మంత్రి అనిత మాట్లాడుతూ... స్క్రిప్ట్ ఎవరిచ్చినా అనుభవించేది రాజానే అని పోసానిని ఉద్దేశించి అన్నారు. వాక్ స్వాతంత్ర్యం ఉందని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే కుదరదని చెప్పారు. అనంతపురంలో జరిగిన ఎస్సైల పాసింగ్ అవుట్ పరేడ్ లో అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని వైసీపీ నేతలకు అనిత వార్నింగ్ ఇచ్చారు. పోసానిపై రాష్ట్ర వ్యాప్తంగా 17 కేసులు ఉన్నాయని తెలిపారు. తాము కక్షపూరితంగా వ్యవహరించలేదని చెప్పారు. పోసాని మాట్లాడిందంతా వీడియోల్లో ఉందని... చేసిన తప్పుకు ఆయన తప్పించుకోలేరని అన్నారు. రెడ్ బుక్ ప్రకారం



తాము ముందుకెళితే వైసీపీ నేతలు ఎవరూ రోడ్లపై తిరగలేరని చెప్పారు. తప్పు చేసిన ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదని అన్నారు. వైసీపీ హయాంలో పోలీస్ శాఖలో రూ. 900 కోట్ల బకాయిలు పెట్టారని... అవన్నీ తాము తీరుస్తున్నామని చెప్పారు. కూటమిలో అంతర్యుద్ధం వచ్చిందని వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ చేసిన వ్యాఖ్యలపై అనిత స్పందిస్తూ... కూటమిలో అంతర్యుద్ధం లేదని, వైసీపీలో అంతర్యుద్ధం రాకుండా చూసుకోవాలని అన్నారు.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక
ROYAL JOURNLISAM

# ఏపీలో రేషన్‌కార్డులు ఉన్నవారికి బ్యాడ్‌న్యూస్.. ఈ నెల కూడా లేనట్లే, ఆ రెండు మాత్రమే పక్కా



అమరావతి : ఏపీలో రేషన్ కార్డులు ఉన్నవారికి ముఖ్యమైన గమనిక. ఈ నెల కూడా కూడా బియ్యం కార్డుదారులకు కందిపప్పు సరఫరా లేకుండా పోయింది. మార్చి నెలకు సంబంధించి శనివారం నుంచి కార్డుదారులకు బియ్యం, పంచదార పంపిణీ చేయనున్నారు. కందిపప్పు రాలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఈ ఏడాది జనవరి నెలలో కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేశారు. కానీ ఫిబ్రవరిలో ఆగింది.. మార్చి నెలలో కూడా సరకు ఇవ్వకపోవడంతో, బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తారు.ఆంధ్రప్రదేశ్‌లో రేషన్‌కార్డులు ఉన్నవారికి బ్యాడ్‌న్యూస్.. ఈ నెల కూడా కందిపప్పు కష్టంగానే మారింది. ఫిబ్రవరిలో రేషన్ కార్డులు ఉన్నవారికి కందిపప్పు పంపిణీ నిలిచిపోగా మార్చిలో ఇస్తారని భావించారు.. కానీ ఈ నెల కూడా లేకుండా పోయాయి. టెండర్లు పూర్తికాకపోవడంతో సరఫరా కష్టమేనని చెబుతున్నారు. గత ప్రభుత్వం కారణంగా పౌరసరఫరాలశాఖ దగ్గర డబ్బులు కూడా లేవంటున్నారు. రాయలసీమలో రాగులు, రాష్ట్రమంతటా జొన్నలు మాత్రం పంపిణీ చేస్తున్నారు.. అదికొంత మేలు జరుగుతోందని చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పేదలకు రాగులు, జొన్నలు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. రాగుల ఉత్పత్తి సరిగా లేకపోవంతో రాయలసీమకు మాత్రమే వీటిని పరిమితం చేశారు. కాకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జొన్నలు పంపిణీ చేస్తున్నారు. ఈ నెల రేషన్ షాపుల ద్వారా కేవలం బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు.ఏపీలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బియ్యం, కందిపప్పు, పంచదారతోపాటుగా చిరుధాన్యాలను కూడా సరఫరా చేస్తామని తెలిపింది. అయితే కొన్ని నెలలు కందిపప్పుతోపాటు జొన్నలు కూడా పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. నవంబరు నెలల రాష్ట్రవ్యాప్తంగా కందిపప్పు అందించారు.. ఆ తర్వాత కందిపప్పు కొన్ని జిల్లాలు మినహా పెద్దగా అందలేదు. కొన్ని జిల్లాల్లో డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో కూడా కందిపప్పు రాలేదు. ఈ నెల కూడా బియ్యం, పంచదారను మాత్రమే ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఈ మేరకు పౌరసరఫరాల గోడౌన్ల నుంచి రేషన్ షాపులకు ఆ రెండు రకాల సరుకులను మాత్రమే పంపిణీ చేయనున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్‌లో పేదలకు ఇచ్చే పంచదార, అంగన్‌వాడీలకు ఇచ్చే కందిపప్పు, నూనె వంటి వస్తువు సరఫరాను నిలిపివేశారు. ఈ సరకుల్లో బరువు తక్కువగా ఉన్నట్లు తేల్చారు. ఒక్కో ప్యాకెట్‌కు 50 నుంచి 100 గ్రాముల తక్కువ బరువు ఉంది. పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గోడౌన్‌లను తనిఖీ చేసిన సమయంలో తేలింది. అందుకే రాష్ట్రవ్యాప్తంగా కందిపప్పు, పంచదార, నూనె వంటి ప్యాకెట్ల పంపిణీ నిలిపివేయించారు. ఆ తర్వాత అన్ని లోపాలను సవరించిన తర్వాత మళ్లీ సరఫరాను ప్రారంభించారు.

# టీడీపీకి రాజీనామా చేసిన తర్వాత జీవీ రెడ్డి ట్వీస్ట్.. చంద్రబాబు, ఏపీ బడ్జెట్‌పై సంచలన ట్వీట్



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవికి, టీడీపీకి జీవీ రెడ్డి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. అయితే రాజీనామా చేసిన తర్వాత తొలి ట్వీట్ చేశారు జీవీ రెడ్డి. అది కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు తో పాటుగా అసెంబ్లీలో శుక్రవారం రోజు ప్రవేశపెట్టిన బడ్జెట్ గురించి స్పందించారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ కేవలం రూ. 33,000 కోట్ల అతి తక్కువ రెవెన్యూ లోటుతోనే రూపొందించారని చెప్పుకొచ్చారు..తాను వృత్తిని కొనసాగిస్తూ రాజకీయాలకు దూరంగా ఉంటానని చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తూనే.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం పట్ల తనకు ఎప్పటికీ గౌరవం, అభిమానం ఉంటుందని ట్వీట్ చేశారు.ఆంధ్రప్రదేశ్ ఫైబర్‌నెట్ ఛైర్మన్ పదవికి జీవీ రెడ్డి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆయన ఇటీవల ఫైబర్‌నెట్ ఛైర్మన్ పదవితో పాటు టీడీపీ ప్రాథమిక సభ్యత్వం, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పదవికి రాజీనామా చేశారు. తెలుగు దేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబుకు తన రాజీనామా లేఖను పంపించారు. అయితే ఫైబర్‌నెట్ ఛైర్మన్ పదవికి రాజీనామాను మాత్రం అంగీకరించారు.. టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి, పదవికి చేసిన రాజీనామాపై క్లారిటీ లేదు. అయితే టీడీపీ, పదవులకు రాజీనామా చేసిన తర్వాత జీవీ రెడ్డి చేసిన ట్వీట్ ఆసక్తికరంగా మారింది.'నిన్న ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ కేవలం రూ. 33,000 కోట్ల అతి తక్కువ రెవెన్యూ లోటుతోనే రూ. 3 లక్షల 22 వేల కోట్ల బారి బడ్జెట్‌ను ప్రణాళికబద్ధంగా రూపొందించారు. నేను నా వృత్తిని కొనసాగిస్తూ రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వం పట్ల నాకు ఎప్పటికీ గౌరవం, అభిమానం ఉంటుంది. తక్కువ కాలంలోనే టీడీపీ లోనూ, ప్రభుత్వ వ్యవస్థలోనూ నాకు గౌరవప్రదమైన బాధ్యతలు అప్పగించడం నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. ఈ అవకాశానికి నేను ఎప్పటికీ మా సార్ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి రుణపడి ఉంటాను. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం 2029లో కూడా మా సార్ ముఖ్యమంత్రి అవ్వాలి . రాష్ట్ర పురోగతికి ఆయనకు మద్దతుగా నిలవడం ప్రతి అభివృద్ధి కోరుకునే తెలుగు వ్యక్తి బాధ్యత' అంటూ జీవీ రెడ్డి ట్వీట్ చేశారు. తాను టీడీపీకి రాజీనామా చేసినా సరే.. వ్యక్తిగతంగా చంద్రబాబుపై అభిమానం ఉందని జీవీరెడ్డి చెబుతున్నారు.'వ్యక్తిగత కారణాలతో తెలుగు దేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, ఏపీ ఫైబర్‌నెట్ ఛైర్మన్ పదవులకు రాజీనామా చేస్తున్నాను. మీరు నాపై ఉంచిన విశ్వాసం.. అందించిన మద్దతుతో పాటు కీలక బాధ్యతలు నిర్వహించేందుకు అవకాశం కల్పించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తెదేపా మరింత బలంగా ఎదిగి ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షిస్తున్నాను. ఇకపై పూర్తిగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతాను. భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీలోనూ చేరే ఉద్దేశం లేదు' అంటూ జీవీ రెడ్డి లేఖ రాశారు.అయితే జీవీ రెడ్డి రాజీనామా తర్వాత పరిణామాలు మారిపోయాయి. ఫైబర్‌నెట్ ఛైర్మన్ పదవికి జీవీ రెడ్డి రాజీనామాకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అలాగే ఫైబర్ నెట్ ఎండీగా ఉన్న ఐఏఎస్ అధికారి దినేష్‌కుమార్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన్ను జీఏడీకి రిపోర్ట్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ఆదిత్యను ఏపీ ఫైబర్ నెట్ నూతన ఎండీగా నియమించారు.

# ఏపీలో వారందరికి గుడ్‌న్యూస్.. ఒక్కొక్కరికి రూ.లక్ష, రూ.75వేలు, రూ.50వేలు సాయం



అమరావతి : ఏపీ ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఇంటి నిర్మాణాలకు ఇస్తున్న ఆర్దిక సహాయానికి అదనంగా బీసీలు, షెడ్యూల్ కులాల వారికి రూ.50వేలు, షెడ్యూల్డ్ తెగల వారికి అదనంగా రూ.75వేలు ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు తెలిపారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు అదనపు సాయం అందించనున్నారు. కేబినెట్‌లో కూడా ఆమోదం తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభలో రూ.3,22,359 కోట్లతో ప్రవేశపెట్టారు. అయితే రాష్ట్ర బడ్జెట్ రూ.3 లక్షల కోట్ల మార్క్‌ను దాటడం ఇదే తొలిసారి అంటున్నారు. వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి అచ్చెన్నాయుడు రూ.48,341 కోట్లతో ప్రవేశపెట్టారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాన్ని చేరుకునేందుకు సంక్షేమానికి, అభివృద్ధికి, హామీల అమలుకు సమప్రాధాన్యమిస్తూ బడ్జెట్‌లో కసరత్తు చేశారు. స్వర్ణాంధ్ర విజన్-2047 సాకారం దిశగా సంక్షేమానికి, అభివృద్ధికి, హామీల అమలు చేసేలా అడుగులు వేశారు. రైతులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, మహిళలకు ప్రాధాన్యం ఇచ్చారు.మరోవైపు గృహ నిర్మణానికి సంబంధించి కేటాయింపులు చేశారు.. ఈ మేరకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన 5.5 లక్షల ఇళ్లకు సంబంధించి యూనిట్ ధర తక్కువగా ఉండడం, సిమెంటు ధరల పెరుగుదల వంటి కారణాలతో నిర్మాణం ఇప్పటికీ ప్రారంభం కాలేదు. 'వీటిలో బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, పీవీటీజీ (ఆదివాసీ గిరిజనులకు)లకు రూ.లక్ష చొప్పున అదనపు సాయం అందివ్వాలని' నిర్ణయించారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అలాగే బడ్జెట్‌లో కూడా ఈ అంశాన్ని ప్రస్తావించారు.టీడీపీ హయాంలో బీసీలకు ప్రయోజనం కల్పించే లక్ష్యంతో ఆదరణ పథకంతో లక్షల మందికి పరికరాలు అందించిన సంగతి తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం అమలు చేయలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ మేరకు రూ.1,000 కోట్ల నిధులు కేటాయించగా.. 1.50 లక్షల మందికి వివిధ ఉపకరణాలు అందజేయనున్నారు. పీఎం కుసుమ్ కింద వ్యవసాయ మోటార్లకు సోలార్ విద్యుత్‌కు సంబంధించి 3 లక్షల కనెక్షన్లకు అనుమతి వచ్చింది. అంతేకాదు 18 లక్షల మందికి లబ్ధి కల్పించేలా రూ.3 లక్షల వరకు రుణాలకు పావలా వడ్డీ, రూ.లక్ష రుణాలకు సున్నా వడ్డీ కింద రాష్ట్రంలో రైతులకు అందించనున్నారు.

# తెలంగాణ రవాణా శాఖ కీలక నిర్ణయం.. ఇక ఇంటి నుంచే ఆ సేవలు..




హైదరాబాద్ :డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇక నుంచి సలుభతరం కానుంది. రవాణా కార్యాలయాల వెంట తిరుగుతూ ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా తెలంగాణ రవాణా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇంటి నుంచి ఈ సేవలను పొందేందుకు అవకాశం కల్పించింది. మార్చి మొదటి వారం నుంచే ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. మొదట సికింద్రాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో ఈ సేవలు అందుబాటులోకి రానుండగా.. త్వరలోనే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నారు.తెలంగాణలో కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పొందాలనుకునే వారికి రవాణా శాఖ శుభవార్త చెప్పింది. ఇక నుంచి ఆఫీస్‌ల వెంట తిరగకుండా.. ఇంట్లోనే వీటిని పొందేలా చర్యలు చేపట్టింది. చాలా మందికి వాహన రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే ముందుగా ఏం చేయాలో అర్థం కాదు. వీరి కోసం ఆర్టీఏ కార్యాలయాల బయట బ్రోకర్లు కాచుకొని కూర్చొంటారు. వారి ద్వారా వెళ్లి.. డ్రైవింగ్ లైసెన్స్ లు పొందిన వారే ఎక్కువగా ఉన్నారు. వాహన రిజిస్ట్రేషన్లు కూడా ఇలానే జరుగుతున్నాయి. డైరెక్ట్ గా కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకొని డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ చేయించుకునే వారి సంఖ్య చాలా తక్కువ. వీటికి తెలంగాణ రవాణా శాఖ చెక్ పెడుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వాహన రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా.. ఇంటి నుంచే ఈ సేవలు పొందేలా కొత్త విధానం అమలులోకి రానుంది.ప్రారంభంలో.. ఈ సేవలను ప్రయోగాత్మకం గా సికింద్రాబాద్ తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలయంలో అందుబాట ులోకి రానుండగా.. దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం రూపొం దించిన 'వాహన్', 'సారథి' పోర్టల్‌లతో తెలంగాణ ప్రభుత్వ అనుసం ధానం పూర్తయింది. ఈ విధానం ద్వారా వాహన రిజిస్ట్రేషన్లు, యజమానుల పేరు మార్పు, ఇతర ప్రాంతాలకు బదిలీ వంటి సేవలను ఆన్‌లైన్‌లోనే పొందవచ్చు. 2016లో కేంద్ర రవాణా శాఖ దేశవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేయగా.. తెలంగాణ ఇప్పటి వరకు పూర్తిగా అనుసంధానం కాలేదు. కానీ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక కేంద్ర పోర్టల్‌తో అనుసంధానం చేసి.. మార్చి మొదటి వారం నుండి సేవలను ప్రారంభించనుంది.ఈ విధానం అమలు తర్వాత కొత్తగా వాహనం కొనుగోలు చేసిన వారు షోరూంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. అక్కడే సారథి పోర్టల్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ కూడా పొందవచ్చు. డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవడానికి కూడా ఈ పోర్టల్ ఉపయోగపడుతుంది. ఇంటి దగ్గర నుంచి కూడా ఈ పోర్టల్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు ఏ రాష్ట్రానికి సంబంధించి ఆ రాష్ట్ర వాహనాల సమాచారం అందుబాటులో ఉండగా.. ఇక నుంచి ఒకేచోట సమాచారం ఉంచేందుకు ఈ పోర్టల్ ను రూపొం దించారు. తెలంగాణలో చాలా జిల్లాలో రవాణా కార్యాలయాలు చిన్న పట్టణాలకు చాలా దూరంగా ఉన్నాయి. అక్కడకు వెళ్లి సేవలు పొందేందుకు వాహనదారులు చాలా ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ కొత్త విధానం అమలు తర్వాత.. ప్రజలకు సమీపంలోని కేంద్రాల్లోనే సేవలు అందుబాటులోకి రానున్నాయి. సికింద్రాబాద్ తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలయంలో ప్రారంభించిన ఈ వ్యవస్థను త్వరలోనే ఇతర జిల్లాలకు విస్తరించనున్నారు. ముందస్తుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. ఆయా ప్రాంతాల్లో ప్రక్రియ ప్రారంభిస్తారని రవాణా శాఖ అధికారుల వెల్లడించారు.

# ఏపీలో అక్కడ ఆర్వోబీ.. కేంద్రం నుంచి రూ.46.64 కోట్లు.. ఇక కష్టాలు తొలగినట్లే



అమరావతి : ఏపీలో రైల్వేగేట్లతో ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఎట్టకేలకు మోక్షం దక్కనుంది. ఆర్వోబీల ఏర్పాటుకు రైల్వేశాఖ నిర్ణయం తీసుకోవడంతో రాకపోకల సమయంలో పడుతున్న కష్టాల నుంచి గట్టెక్కనున్నారు. జాతీయ రహదారి ఆధునికీకరణ జరిగినప్పటికీ వీటి నుంచి మోక్షం దక్కలేదు. ముఖ్యంగా పలాస నియోజకవర్గాల పరంగా కొన్ని ప్రధాన రైల్వే గేట్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా కాశీబుగ్గ ఫ్లై ఓవర్‌కు సంబంధించి లైన్ క్లియర్ అయ్యింది.. రూ.46.64 కోట్లు ఇస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో రోడ్ల నిర్మాణ పనుల్ని వేగవంతం చేసింది. హైవేలతో పాటుగా ఫ్లై ఓవర్లపై ఫోకస్ పెట్టారు.. తాజాగా మరో ఫ్లై ఓవర్‌కు సంబంధించి లైన్ క్లియర్ అయ్యింది. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వేశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రూ.46.64 కోట్లు ఇస్తున్నట్లు రైల్వేశాఖ ఇంజనీరింగ్ అధికారుల నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పలాస ఎమ్మె ల్యే గౌతు శిరీష గతంలో అధికారుల్ని కలిసి రిక్వెస్ట్ చేయడంతో నిధులకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ విషయాన్నికేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సోషల్‌మీడియా ద్వారా తెలిపారు.'పలాస ప్రజలకు శుభవార్త.. పలాసకు ఎంతో అవసరమైన %=వాదీ% వంతెన పనులు రూ.46.64 కోట్ల సవరించిన అంచనాలతో పూర్తిగా రైల్వే శాఖ చేపట్టేలా పునః ప్రారంభం కాబోతున్నాయి. పెండింగ్ నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కి , రైల్వే శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ , ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్గదర్శకత్వంతో శ్రీకాకుళం అభివృద్ధికి మరిన్ని ప్రాజెక్టులు తీసుకువచ్చి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తాము' అంటూ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా తెలిపారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాశీబుగ్గ, బెండి రైల్వే ఫ్లైఓవ ర్ బ్రిడ్జిలకు శంకుస్థాపన చేశారు.. కానీ నిర్మించలేకపోయారు. ఆ తర్వాత టీడీపీ ప్రభుత్వం బెండి బ్రిడ్జిని పూర్తి చేసి ప్రారంభించారు. కాశీబుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జి కొన్ని సమస్యలతో పూర్తి చేయలేదు. గత ప్రభుత్వ హయాంలో సగం పూర్తి చేయగా.. ఆ పనులు ఆగిపోయాయి. అలాగే నిర్మాణ సామాగ్రి ధరలు పెరగడం, నిర్వాసితుల సమస్యలు తేలకపోవడంతో వ్యయం పెరిగింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పలాస ఎమ్మెల్యే శిరీష ఫ్లై ఓవర్ విషయాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు.కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు రైల్వేమంత్రి అశ్వనివైష్ణవ్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. వెంటనే సానుకూలంగా స్పందించిన రైల్వేమంత్రి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రైల్వేశాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు చేశారు.. తాజాగా రూ. 46.64 కోట్లకు లైన్ క్లియర్ చేశారు. ఈ ఫ్లై ఓవర్ పనులు త్వరలోనే ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. ఈ ఫ్లై ఓవర్ కోసం నిధులు విడుదల చేసినందుకు పలాస నియోజకవర్గ ప్రజల తరుపున రైల్వే మంత్రి, పౌరవిమానయానశాఖ మంత్రికి ఎమ్మెల్యే గౌతు శిరీష ధన్యవాదాలు తెలిపారు. ఈ బ్రిడ్జి లేకపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు అంటున్నారు. అక్కడ రైల్వే గేటు వేశారంటే కనీసం 45 నిమిషాలు ఇబ్బందిపడాలి అంటున్నారు. మొత్తానికి బ్రిడ్జికి మోక్షం లభించిందని స్థానికులు అంటున్నారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణం వేగవంతం చేయాలని కోరుతున్నారు.

# తెరపైకి 'సజ్జల'! పోసాని కృష్ణమురళి రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు



అమరావతి : ఇటీవల అరెస్టయిన నటుడు పోసాని కృష్ణమురళి రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కులాలు, వర్గాలపై తాను గతంలో అనుచిత వ్యాఖ్యలు చేశానని పోలీసులు ముందు అంగీకరించారు. పవన్ కళ్యాణ్, నారా లోకేశ్ కుటుంబసభ్యులను దూషించినట్లు పోసాని తెలిపారని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.అయితే, తాను చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వెనుక వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ప్రమేయం ఉందని పోసాని కృష్ణమురళి చెప్పడం గమనార్హం. సజ్జల రాసిచ్చిన స్క్రిప్టు మేరకే తాను విమర్శలు చేసినట్లు పోసాని చెప్పినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. పవన్ అభిమానులను రెచ్చగొట్టే ఉద్దేశంతోనే తాను మాట్లాడినట్లు పోసాని తెలిపారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా ఉంటూ వైసీపీకి మద్దతుగా వ్యవహరించానని పేర్కొన్నారు.హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో పవన్‌ను వ్యక్తిగతంగా దూషించడం వెనుక సజ్జల రామకృష్ణారెడ్డి ప్రమేయం ఉందని, ఆయన అనుమతితోనే మీడియా సమావేశం ఏర్పాటు చేసినట్లు పోసాని పోలీసులకు తెలిపారు. తాను మాట్లాడిన మాటలను సజ్జల రామకృష్ణారెడ్డి తనయుడు భార్గవ రెడ్డి సోషల్ మీడియాలో వైరల్ చేసేవాడని పోసాని చెప్పుకొచ్చారు.ఈ మేరకు పోసాని కృష్ణమురళి చెప్పిన విషయాలతో రిమాండ్ రిపోర్టును పోలీసులు శుక్రవారం రైల్వే కోడూరు కోర్టుకు సమర్పించారు. ఇటీవల అరెస్టయిన పోసానికి అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు కోర్టు గురువారం ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో మార్చి 12 వరకు పోసాని రిమాండ్‌లో ఉండనున్నారు. ప్రస్తుతం పోసాని కృష్ణమురళి రాజంపేట సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. మరోవైపు, పోసానిని ఐదు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, విచారణను సోమవారానికి కోర్టు వాయిదా వేసింది.కాగా, పోసాని కృష్ణమురళిని హైదరాబాద్ నగరంలో బుధవారం ఏపీ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లపై తీవ్రమైన అసభ్య, అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతో పోసానిపై పలు కేసులు నమోదయ్యాయి.

# తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టు.. ఈ ఏడాది డిసెంబర్ నుంచే ఎగరనున్న విమానాలు..!



హైదరాబాద్ : తెలంగాణ ప్రజలకు గుడ్‌న్యూస్. త్వరలోనే కొత్త ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానుంది. ఈ మేరకు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. వరంగల్ జిల్లా మామూనూరు వద్ద బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. త్వరలోనే పనులు ప్రారంభం కానుండగా.. ఈ ఏడాది డిసెంబర్ నుంచి విమానాలు రాకపోకలు సాగించనున్నాయి.తెలంగాణలో ప్రస్తుతం శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి మాత్రమే విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. పొరుగు రాష్ట్రాల్లో మూడు, నాలుగు చోట్ల విమానాశ్రయాలు అందుబాటులో ఉండగా.. తెలంగాణలో మాత్రం ఒక్కటే విమానాశ్రయం ఉంది. దీంతో తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది. వరంగల్, కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్‌లో నాలుగు కొత్త ఎయిర్?పోర్టులు నిర్మించాలని ప్రతిపాదించి కేంద్రానికి పంపింది. ఇందులో వరంగల్ మామూనూరు ఎయిర్‌పోర్టుపై కీలక అప్డేట్ వచ్చింది.మామునూరు బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అన్ని అనుమతులు ఇస్తూ.. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ (ఏఏఐ) నిర్మాణం ప్రారంభించడానికి వీలుగా సంబంధిత ఫైల్‌పై కేంద్ర విమానాయనశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు శుక్రవారం సంతకం చేశారు. మామునూరులో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి మొత్తం 949.14 ఎకరాల భూమి అవసరం కాగా.. ఇప్పటికే 696.14 ఎకరాల భూమి సేకరించారు. మరో 253 ఎకరాలు కావాలని ఏఏఐ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఆ భూమిని సేకరించే ప్రక్రియ ప్రస్తుతం చురుగ్గా సాగుతోంది.మామునూరు బ్రౌన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఈ ఏడాది డిసెంబరులోగా విమానాలు నడిపించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో టెర్మినల్ నిర్మాణానికి ఈ నెలలోనే డిజైన్లు తయారు చేయనున్నారు. అనందరం టెండర్లు పిలవాలని యోచిస్తున్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి తొలిదశ పనులు పూర్తిచేసి రాజధాని హైదరాబాద్ నగరంతో పాటు.. దక్షిణాదిలోని ప్రముఖ ప్రాంతాలకు విమానాలు నడిపించాలని టార్గెట్ పెట్టుకున్నారు.సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు ఇటీవల జిల్లా ఇంఛార్జ్ మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇతర మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు ఎయిర్‌పోర్టు పనుల పురోగతిపై పలుమార్లు అధికారులతో సమీక్షలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులపైనా ఏఏఐతో పాటు రాష్ట్ర ఉన్నతాధికారులకు కీలక సూచనలు చేశారు. ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే.. ఉమ్మడి కరీంనగర్, ఖమ్మం, నల్గొండ ప్రజలకు ఎయిర్ కనెక్టివిటీ సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.

# హైదరాబాద్-బెంగళూరు మధ్య డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్!



హైదరాబాద్: రక్షణ రంగంలో భారతదేశాన్ని నంబర్ వన్ స్థానంలో నిలబెట్టడంలో తెలంగాణ ప్రభుత్వం తన వంతు ప్రయత్నం చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఆ మేరకు రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వ సహకారం కావాలన్నారు. దేశ రక్షణ రంగానికి ముఖ్య కేంద్రాలుగా ఉన్న హైదరాబాద్-బెంగళూరు నగరాల మధ్య డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గారిని కోరారు.జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన విజ్ఞాన్ వైభవ్- 2025 ప్రదర్శనను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ ప్రారంభించారు. సభా ప్రాంగణంలో శాస్త్ర రంగంలో దిగ్గజులైన దివంగత భారతరత్నాలు సీవీ రామన్, అబ్దుల్ కలాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి కీలక అంశాలను ప్రస్తావించారు."తెలంగాణ రాష్ట్రం.. ప్రత్యేకించి హైదరాబాద్ నగరం కొన్ని దశాబ్దాలుగా దేశ రక్షణలో అత్యంత కీలక పాత్ర పోషిస్తోంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న బీడీఎల్, డీఆర్‌డీఓ, మిథాని, హెచ్ఏఎల్ వంటి సంస్థలు దేశ రక్షణ కోసం రాకెట్లు, మిస్సైల్స్ తదితర ఉత్పత్తులను తయారు చేస్తున్నాయి. దేశ రక్షణ రంగానికి హైదరాబాద్‌తో పాటు బెంగళూరు ముఖ్య కేంద్రాలుగా ఉన్నాయి. ఈ రెండు నగరాల మధ్య "హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్"ను ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని గతంలోనూ కోరామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు."హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్" ఏర్పాటు ద్వారా రక్షణ రంగంలో భారీగా పెట్టుబడులు వస్తాయి. స్కైరూట్ లాంటి స్టార్టప్, ప్రైవేటు సంస్థలు ఇప్పటికే రాకెట్లను తయారు చేస్తున్నాయి. కారిడార్ ప్రకటన రక్షణ రంగానికి మరింత ఊతం ఇచ్చినట్టు అవుతుంది. హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు రక్షణ మంత్రిగా రాజ్‌నాథ్ సింగ్ సహకారం, మద్దతు ఎంతో అవసరం. రక్షణ రంగంలో భారతదేశాన్ని నంబర్ వన్ స్థాయికి తీసుకెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వంగా మేము ప్రయత్నిస్తామని సీఎం రేవంత్ చెప్పారు.దేశ రక్షణ బాధ్యత యువతీ యువకులపైనే ఉంది. ఐటీ నిపుణులతో పాటు సంప్రదాయ కోర్సులు చదివే ఇంజనీర్ల అవసరం కూడా మన దేశానికి చాలా ఉంది. యువతను ఆ దిశగా ప్రోత్సహించేందుకు సంప్రదాయ ఇంజనీరింగ్ కోర్సులకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నాం. లక్షలాది మంది విద్యార్థిని విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించి, దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యతపై వారిలో స్ఫూర్తి నింపడంలో ఇలాంటి ఎగ్జిబిషన్స్ ఉపయోగపడతాయి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

# హైదరాబాద్ వాసులకు గుడ్‌న్యూస్.. ఆ ప్రాంతాల్లో విశాలమైన స్కైవాక్‌లు.. మెట్రో దిగి డైరెక్టుగా..!



హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు గుడ్ న్యూస్. ఇకపై మెట్రో రైలు దిగి ట్రాఫిక్‌లో విన్యాసాలు చేస్తూ రోడ్లు దాటాల్సిన అవసరం లేకుండానే ఇంటికి చేరుకోవచ్చు. ఎలాగంటారా..? ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ దగ్గర్లో నిర్మిస్తోన్న భారీ నివాస సముదాయాలకు డైరెక్టుగా స్కైవాక్ నిర్మించుకునేందుకు మెట్రో సంస్థ అనుమతులిచ్చింది. మరోవైపు.. నాగోల్, ఎల్బీనగర్ మెట్రో స్టేషన్‌ల మధ్య విశాలమైన స్కైవాక్ నిర్మించాలని భావిస్తున్నారు. మరోవైపు.. ఓల్డ్ సిటీ మెట్రో మార్గంలోనూ స్కైవాక్ నిర్మించనున్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య నుంచి తప్పించుకునేందుకు.. చాలా మంది మెట్రో రైలును ఆశ్రయిస్తున్నారు. అయితే.. మెట్రో రైలు దిగిన తర్వాత కూడా గమ్యం చేరుకునేందుకు మళ్లీ రోడ్డుపై అడ్డదిడ్డంగా వచ్చే వాహనాలను దాటుకుంటూ రోజూ సాహసం చేయాల్సిందే. ఈ క్రమంలో.. మెట్రో దిగి రోడ్డు దాటకుండా ట్రాఫిక్‌లో సాహసాలు చేయాల్సిన అవసరం లేకుండా ఆయా ప్రాంతాల్లో విశాలమైన స్కైవాక్‌లు నిర్మించాలని యోచిస్తున్నారు. అయితే.. ఇప్పటికే.. కొన్ని మెట్రో స్టేషన్ల పక్కన నిర్మించిన షాపింగ్ మాల్స్‌కు డైరెక్ట్ స్కైవాక్‌లు నిర్మించిన సంగతి తెలిసిందే. అదే విధంగా.. ఇప్పుడు రియల్‌ఎస్టేట్ సంస్థలు నిర్మిస్తున్న పెద్ద పెద్ద అపార్ట్మెంట్లకు కూడా స్కైవాక్ నిర్మించుకోవాలని ప్రపోజల్ పెట్టగా.. అందుకు ప్రభుత్వం అనుమతులిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో.. మెట్రో దిగగానే.. ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా డైరెక్టుగా ఇంటికే వెళ్లిపోవచ్చు.గతేడాది నవంబర్లో మెట్రో పర్మిషన్తో కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ మాల్.. మెట్రోస్టేషన్ నుంచి డైరెక్ట్ స్కైవాక్ నిర్మించుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఎల్బీనగర్ మెట్రోస్టేషన్ సమీపంలో నిర్మిస్తున్న భారీ హౌసింగ్ కమ్యూనిటీకి మెట్రో స్టేషన్ నుంచి స్కైవాక్ నిర్మించుకోవడానికి సంస్థ అనుమతులిచ్చింది. దీంతో సదరు కన్‌స్ట్రక్షన్ కంపెనీ సొంత ఖర్చుతో స్కైవాక్ నిర్మించుకోనుంది. ఈ స్కైవాక్ పూర్తయితే ఆ టవర్లలో ఉండే జనాలు ఇంటి నుంచి డైరెక్ట్ మెట్రో స్టేషన్కు... మెట్రో రైలు దిగి డైరెక్ట్‌గా ఇంటికి వెళ్లే అవకాశం ఉంది.మరోవైపు.. మెట్రో రెండో దశలో భాగంగా ప్రయాణికులు సులభంగా మెట్రోస్టేషన్లకు చేరుకునేలా.. స్టేషన్ల నుంచి ఇతర ప్రదేశాలకు వెళ్లేలా పలు చోట్ల విశాలమైన స్కైవాక్‌లు నిర్మించాలని సంస్థ భావిస్తోంది. నాగోల్- ఎయిర్‌పోర్ట్ రూట్లో కొత్తగా నాగోల్ వద్ద నిర్మించనున్న మెట్రోస్టేషన్ నుంచి ఎల్బీనగర్ వైపు ఓ విశాలమైన స్కైవాక్ నిర్మించాలని యోచిస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం.. అటు నాగోల్, ఇటు ఎల్బీనగర్ స్టేషన్లను కలుపుతూ విశాలమైన స్కైవాక్ నిర్మించాలని నిర్ణయించారు.అలాగే.. కొత్తగా నిర్మించబోయే ఎల్బీనగర్ (ఎయిర్ పోర్టు) మెట్రో స్టేషన్ను, ప్రస్తుతం కారిడార్-1లో ఉన్న ఎల్బీనగర్ మెట్రో స్టేషన్‌ను కలుపుతూ మరో విశాలమైన స్కైవాక్ నిర్మించాలని నిర్ణయించారు. ఈ స్కైవాక్ ద్వారా ఎల్బీనగర్‌లో దిగిన వాళ్లు డైరెక్ట్ ఎల్బీనగర్ (ఎయిర్పోర్ట్) స్టేషన్కు వెళ్లి ఈజీగా ఎయిర్పోర్టుకు చేరుకునే అవకాశం ఉంటుంది.మరోవైపు... ఓల్డ్ సిటీ మెట్రో మార్గంలో కూడా రద్దీ చోట్లలో విశాలమైన స్కైవాక్‌లు నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ మేర నిర్మిస్తున్న ఈ కారిడార్‌లో సాలర్ జంగ్ మ్యూజియం, చార్మినార్ సమీపంలో నుంచే మెట్రో వెళ్లనుండగా.. ఆ ప్రాంతాల్లో రెండు మెట్రో స్టేషన్ల నిర్మాణం జరగనుంది. ఈ చారిత్రక ప్రదేశాలకు పర్యాటకుల తాకిడి ఎప్పుడూ ఎక్కువగానే ఉండనుండగా.. ఈ రెండు స్టేషన్‌ల మధ్య విశాలమైన స్కైవాక్‌లు నిర్మించాలని భావిస్తున్నారు.

